ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 183

సోమవారం 6 జనవరి 2025 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## యాదగిరిగుట్టలో భక్తుల కోలాహలం...!!

ధర్మదర్శనానికి మూడు, స్పెషల్ దర్శనానికి గంట సమయం.. శ్రీవారి ఖజానాకు రూ. 52, 90, 951ఆదాయం






## నేడు చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభం

**వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ**

**ప్రత్యక్ష వీక్షణకు ఏర్పాట్లు**



న్యూఢిల్లీ, రోమింగ్‌న్యూస్: సర్వ హంగులతో స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీతో అధునాతనంగా నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ సోమవారం ప్రధాని మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభం

మిగతా 2 లో



# తెలుగువారు ప్రపంచంతో పోటీ పడాలి

**ఏపీ, తెలంగాణ కలిసి సమస్యలుంటే చర్చించుకుని పరిష్కరించుకుందాం**



**ఐటీ, ఫార్మాల్లో అత్యున్నత స్థాయిలో తెలుగువారు**

**హాలీవుడ్‌తో పోటీ పడుతున్న తెలుగు సినిమా రంగం**

**గతంలో జాతీయ రాజకీయాల్లో కీలకంగా తెలుగునేతలు**

**ప్రస్తుతం అటువంటి ప్రభావం చూపలేకపోతున్నాం**

**సైబరాబాద్‌తో ఐటీని చంద్రబాబు అభివృద్ధి చేస్తే..**

**దానిని వైఎస్ఆర్ మరింత ముందుకు తీసుకెళ్లారు**

**ప్రపంచంలోని తెలుగువారు పెట్టుబడులు పెట్టండి**

**సింగిల్ విండోలో అనుమతులిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి**

**ప్రపంచ తెలుగు సమాఖ్య ముగింపు సభలకు హాజరు**

హైదరాబాద్, రోమింగ్‌న్యూస్: తెలంగాణ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు పోటీ అని చాలామంది అంటుంటారని, కానీ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కలిసి ప్రపంచ దేశాలతో పోటీపడేలా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆ దిశగా ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావాల్సిన

మిగతా 2 లో

## మోసాల్లో కాంగ్రెస్‌కు గురువు కేసీఆరే

**రైతు భరోసా.. బోగస్**

**స్థానిక ఎన్నికల తర్వాత ఇదీ ఇవ్వరు**

**రాష్ట్రంలో 14 శాతం కమీషన్ ప్రభుత్వం**

**ఇద్దరు, ముగ్గురు మంత్రులకైతే అదే పని**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు**



హైదరాబాద్,రోమింగ్‌న్యూస్: రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డుల పేరిట మరో సారి మోసగించేందుకు కాంగ్రెస్ సర్కార్ ప్రయత్నిస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలను మోసం చేయడంలో

మిగతా 2 లో

## మార్చిలోగా గ్రూప్-1 నియామకాలు

**జాబ్ క్యాలెండర్ ప్రకారమే ఉద్యోగాలు**

**రాష్ట్రం నుంచి సివిల్స్‌కు అధికంగా ఎంపిక కావాలి**

**సీఎం రేవంత్‌రెడ్డి సివిల్స్ అభ్యర్థులకు చెక్కుల పంపిణీ**



02

## సంక్రాంతికి 52 ప్రత్యేక రైళ్లు

నేటి నుంచి 18వ తేదీ వరకు అందుబాటులో...



02

## సీఎంఆర్ బాలికల హాస్టల్ ఘటనలో ఇద్దరి అరెస్టు

హాస్టల్‌లోని వంట మనుషులే నిందితులు

నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల చైర్మన్, డైరెక్టర్, ప్రిన్సిపాల్, ఇద్దరు వార్డెన్లపైనా కేసు



02

## డిసెంబర్ 31న కండోమ్స్ ఆర్డర్ల జోరు

న్యూయర్ వేడుకల్లో క్విక్ కామర్స్ వేదికలు అత్యధిక డెలివరీ



06




## మాట తప్పడమే ఇందిరమ్మ రాజ్యమా?

**నమ్మక ద్రోహం కాంగ్రెస్ నైజం**

**రైతులను దగా చేసిన రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు ముక్కు నేలకు రాయాలి**

**కేటీఆర్ విమర్శలు.. నేడు రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ నిరసన**

06

### ఫార్ములా-ఈ కేసులో.. నేడు ఏసీబీ విచారణకు కేటీఆర్!

విచారణకు రావాల్సిందిగా ఈడీ సమన్లు

.. వివరాలు 6లో

## గురుకుల విద్యార్థుల ప్రయోజనాలే ముఖ్యం

**ఆర్థిక ఇబ్బందులున్నా కాస్మెటిక్ చార్జీలు పెంచాం: భట్టి**

బీబీనగర్, రోమింగ్‌న్యూస్: వసతి గృహాల్లోని విద్యార్థుల ప్రయోజనాలే ముఖ్యమని, అందుకే ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి కాస్మెటిక్ చార్జీలు పెంచామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆదివారం ఆయన

మిగతా 6 లో



## చలి.. అసలు తగ్గేదేలే

**అర్లీలో 5.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు**

**రాష్ట్రవ్యాప్తంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు**





06

## వినతిపత్రమూ ఇవ్వనివ్వరా?

**మాజీ ఎమ్మెల్యే పెద్ది సహా బీఆర్ఎస్ నేతలను నిర్బంధించడం దుర్మార్గం**

**పోలీసుల తీరుపై హరీశ్‌రావు ఫైర్**

## రోడ్డు ప్రమాదం.. కుటుంబం చిన్నాభిన్నం

06

లారీ బైక్‌ను ఢీకొని తల్లి, తండ్రి, కుమార్తె మృతి

కుమారుడికి తీవ్ర గాయాలు.. మేడ్చల్‌లో ఘటన



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
6 జనవరి
2025



# తెలుగువారు ప్రపంచంతో పోటీ పడాలి

**మొదటి పేజీ తరువాయి**

అవసరం ఉందన్నారు. ఏపీ, తెలంగాణ పోటీ పడే కన్నా.. రెండు రాష్ట్రాలు కలిసి అభివృద్ధి పథం వైపు నడిస్తే కచ్చితంగా ప్రపంచంలోనే ఆదర్శవంతమైన రాష్ట్రాలుగా రాణిస్తాయని పేర్కొన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య ఏమైనా సమస్యలున్నా.. చర్చించుకుని పరిష్కరించుకుందామని అన్నారు. దేశాల మధ్య యుద్ధాలు తలెత్తినప్పుడు కూడా చర్చల ద్వారా పరిష్కారమైన సందర్భాలున్నాయని, రాష్ట్రాల మధ్య సమస్యలను పరిష్కరించుకోడానికి ఆ విధంగా ఆలోచన చేయలేమా! అని వ్యాఖ్యానించారు. ఆదివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగిన ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభల ముగింపు ఉత్సవానికి సీఎం రేవంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత నార్నే విజయలక్ష్మి సంపాదకత్వంలో వెలువడిన "తెలుగుదనం- తెలుగు ధనం" పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ప్రముఖ సినీనటులు జయప్రద, జయసుధ, మురళీమోహన్, సాయికుమార్, నిర్మాత అశ్వినీదత్ తదితరులను సత్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. దివంగత నేత నందమూరి తారకరామారావు చేతులమీదుగా 30 ఏళ్ల కిందట ప్రారంభమైన ఈ సంస్థ 12వ ద్వైవార్షికోత్సవంలో పాల్గొనడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. "ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారి జనాభా 18కోట్ల మంది పైచిలుకు అని ఒక అంచనా. అయినా జాతీయ రాజకీయాలపై తెలుగువాళ్లం ప్రభావం చూపలేకపోతున్నాం"అని రేవంత్ అన్నారు. గతంలో నీలం సంజీవరెడ్డి, పీవీ నర్సింహారావు, ఎన్టీ రామారావు జాతీయ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారని, ఆ తర్వాత వెంకటస్వామి, జైపాల్‌రెడ్డి, వెంకయ్యనాయుడు ప్రభావం చూపించారని గుర్తు చేశారు. రెండు, మూడు తరాలకు మధ్య.. చంద్రబాబు, వైఎసఆర్ ప్రభావం చూపించినా.. ప్రస్తుతం జాతీయ రాజకీయాల్లో తెలుగువారి పాత్ర సన్నగిల్లిందన్నారు. అయితే ఐటీ, ఫార్మా రంగాల్లో తెలుగువారు ఎందరో అత్యున్నత స్థాయిల్లో రాణిస్తున్నారని తెలిపారు.

దేశంలో 35 శాతం ఔషధాలు (బల్క్ డ్రగ్స్) హైదరాబాద్‌లోని తెలుగువారి కంపెనీల నుంచి ఉత్పత్తి అవుతున్నాయని చెప్పడానికి సంతోషిస్తున్నానన్నారు. నాడు ప్రధాని రాజీవ్‌గాంధీ ఈ దేశానికి కంప్యూటర్‌ను పరిచయం చేసి, సాంకేతిక రంగంలో దూసుకెళ్లగలిగేందుకు అవసరమైన పునాదులు నిర్మించారని చెప్పారు. దానిని అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం నారా చంద్రబాబు అందిపుచ్చుకుని సైబరాబాద్‌ను ప్రపంచంతోనే పోటీపడే విధంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. తర్వాత వైఎస్ దానిని మరింత ముందుకు తీసుకెళ్లారని వెల్లడించారు. "హైదరాబాద్ నగరాన్ని మహమ్మద్ కులీ కుతుబ్‌షా, సికింద్రాబాద్‌ను ఆంగ్లేయులు, నిజాం నవాబులు, సైబరాబాద్‌ను నారా చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిర్మిస్తే.. అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆనుకొని 30 వేల ఎకరాల్లో ఫోర్త్ సిటీ పేరుతో ఒక అత్యాధునిక మహానగరాన్ని నిర్మించడానికి తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. అంతర్జాతీయ స్థాయి నగరాలకు దీటుగా దీనిని రూపొందించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం" అని రేవంత్ చెప్పారు.

**రాజకీయాల్లోకి వచ్చాకే విలువ తెలిసింది..**

చిన్నతనం నుంచి ఉన్నత విద్య వరకు ఆంగ్ల మాధ్యమంలో చదివిన తనకు రాజకీయాల్లోకి వచ్చాకే తెలుగు విలువ తెలిసిందని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని గుర్తించి.. ఇప్పుడు తన మనుమలకు తెలుగు నేర్పిస్తున్నట్లు తెలిపారు. మలేసియా ప్రతినిధుల నృత్య ప్రదర్శన, పద్యాల ఆలాపన ప్రేక్షకులను ఆకట్టుకుంది. కాగా, వ్యాఖ్యాతగా వ్యవహరించిన నటుడు బాలాదిత్య "తెలంగాణ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్..."అంటూ రేవంత్ సమక్షంలోనే తడబడ్డారు.

**హాలీవుడ్‌తో పోటీ పడుతున్న తెలుగు సినిమా**

తెలుగు సినిమా రంగం నేడు దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని, హాలీవుడ్‌తో సైతం పోటీపడుతున్న సందర్భాలు చూస్తున్నామని సీఎం రేవంత్ ప్రశంసించారు. "రాజకీయాలు, ఆర్థిక, సామాజిక, సినీరంగాలలో రాణించడానికి ఏ భాషనైనా నేర్చుకోండి. కానీ, తోటి తెలుగువారితో మన మాతృభాషలోనే మాట్లాడండి. విదేశాల్లోని తెలుగు వారంతా తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు ఆలోచన చేయాలి. తెలంగాణ రైజింగ్ నినాదంతో రాబోయే 25 ఏళ్లకు తగిన ఒక అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నాం. దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో రాణిస్తున్న తెలుగువారంతా తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యం కండి. పెట్టుబడులు పెట్టండి. అందుకు అవసరమైన అనుమతులన్నింటినీ సింగిల్ విండోలో ఇచ్చే బాధ్యత నాది" అని రేవంత్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాలను వీలైనంత వరకు తెలుగులో వెలువరించేందుకు ప్రయత్నిస్తామని ప్రకటించారు. అంతకుముందు ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రధాన కార్యదర్శి నార్నే విజయలక్ష్మి మాట్లాడుతూ... ఈ కాలానికి తగినట్టుగా పెద్ద బాలశిక్షను సవరించి, ప్రాథమిక స్థాయి విద్యాబోధనలో భాగం చేయాలని సీఎంను కోరగా.. తప్పకుండా విద్యా కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని రేవంత్ తెలిపారు. ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు నిర్వహించిన ఇందిరాదత్‌ను ప్రశంసించారు.



## మార్చిలోగా గ్రూప్-1 నియామకాలు

హైదరాబాద్, జనవరి 5 : గ్రూప్-1 పోస్టుల నియామకాలను మార్చి 31లోగా పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 14 ఏళ్లుగా గ్రూప్-1 నిర్వహించలేదని, తాము అడ్డంకులను, కుట్రలను అధిగమించి 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి పరీక్షలను నిర్వహించినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకారమే ఉద్యోగాలను భర్తీ చేస్తామని పునరుద్ఘాటించారు. 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం కింద ఆదివారం ఆయన ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఆర్థిక సాయంగా రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీ లేక నిరుద్యోగులు ఎంతగానో నష్టపోయారన్నారు. "ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే.. దేశంలో ఎక్కడా లేని విధంగా 55,143ఉద్యోగ నియామకాలు చేపట్టాం. సివిల్స్‌కి రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో అభ్యర్థులు ఎంపిక కావాలన్న లక్ష్యంతో అభయహస్తాన్ని ప్రారంభించాం. అభ్యర్థులకు ఆర్థికంగా అండగా ఉండేలా.. రూ.లక్ష సాయం అందిస్తున్నాం. రాష్ట్రం నుంచి యూపీఎస్సీ ఇంటర్వ్యూకి వెళ్లే ప్రతి అభ్యర్థి సివిల్స్‌కు ఎంపికవ్వాలని ఆకాంక్షిస్తున్నాను. దేశంలో అత్యధికంగా సివిల్స్ ఎంపిక మన రాష్ట్రం నుంచి జరుగుతుందని గర్వంగా చెప్పుకొనేస్థాయికి తెలంగాణను తీసుకెళ్లాలి" అని అభిలషించారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికయ్యే అభ్యర్థులకు ఢిల్లీలో వసతి కల్పిస్తామన్నారు. "ఏ రాష్ట్రంలో లేని విధంగా సివిల్స్ వైపు యువత మొగ్గుచూపేలా సింగరేణి సంస్థ తరఫున ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించాం. ప్రతి దశలోనూ సివిల్స్ అభ్యర్థులు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున సాయం అందిస్తాం" అని వ్యాఖ్యానించారు. కాగా, టీఎసజెన్‌కోలో అసిస్టెంట్ ఇంజనీర్స్, కెమిస్ట్ పోస్టులకు ఎంపికైన 315 మంది అభ్యర్థులకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# నేడు చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభం




**మొదటి పేజీ తరువాయి**

కానుంది. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్‌లపై ఒత్తిడి తగ్గించి, నగరంలో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు నాల్గో టెర్మినల్‌గా చర్లపల్లి రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే. ఆరున్నరేళ్ల కాల వ్యవధిలో దాదాపు రూ.428 కోట్లతో నిర్మితమైన ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే శివారు ప్రాంతాలకు చెందిన ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుంది. కాగా, ప్రారంభోత్సవ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసార వీక్షణకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ప్రారంభోత్సవ కార్యక్రమానికి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రులు మంత్రి జి.కిషన్ రెడ్డి, వి.సోమన్న, రవనీత్ సింగ్, బండి సంజయ్, గవర్నర్ విష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, తదితరులు హాజరవుతున్న ట్లు అధికారులు తెలిపారు. కాగా, జనవరి 7 నుంచి సికింద్రాబాద్- సిర్పూర్ కాగజ్‌నగర్- సికింద్రాబాద్ (12757-12758), గుంటూరు- సికింద్రాబాద్- గుంటూర్ ఎక్స్‌ప్రెస్ (17201-17202), సికింద్రాబాద్- సిర్పూర్ కాగజ్‌నగర్- సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్(17233-17234) రైళ్లకు చర్లపల్లిలో అదనపు స్టాపేజ్ ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్ స్టేషన్ నుంచి చెన్నై సెంట్రల్ వెళ్లి వచ్చే రైళ్లు (12603-12604) మార్చి 7 నుంచి,. గోరఖ్‌పూర్- సికింద్రాబాద్ వెళ్లి వచ్చే రైళ్లు (12589-12590) మార్చి 12 నుంచి చర్లపల్లి టెర్మినల్ నుంచే రాకపోకలు సాగిస్తాయని అధికారులు చెప్పారు.

**పలు ప్రాజెక్టుల ప్రారంభం, శంకుస్థాపన**

ప్రధాని మోదీ సోమవారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా పలు రైల్వే ప్రాజెక్టులకు ప్రారంభం, శంకుస్థాపన చేయనున్నారు. కొత్తగా జమ్మూ రైల్వే డివిజన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం ఈస్ట్ కోస్ట్ రైల్వేకు చెందిన రాయగడ రైల్వే డివిజన్ భవనానికి శంకుస్థాపన చేస్తారు.

# మోసాల్లో కాంగ్రెస్‌కు గురువు కేసీఆరే

**మొదటి పేజీ తరువాయి**



కాంగ్రెసకు బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆరే గురువు అని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో పనిచేసిన అధికారులే కాంగ్రెస్ సర్కారులో కొనసాగుతున్నరని, గత పదేళ్లలో బీఆర్ఎస్ ఎలా మోసం చేసిందో... ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే చేస్తోందని దుయ్యబట్టారు. టీజీఐఐసీ భూములు తనఖా పెట్టి రూ.10వేల కోట్లు అప్పు తెచ్చారని, ఆ నిధులనే ప్రస్తుతం రైతు భరోసాకు వినియోగిస్తున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు రూ.15వేలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు రూ.12వేలు అంటున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత అది కూడా ఇవ్వరని జోస్యం చెప్పారు.

రైతు భరోసాను బోగసగా మార్చిన ఘనత కాంగ్రెస్ సర్కార్‌దేనని దుయ్యబట్టారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నెలా రూ.10వేల కోట్లు అప్పు తెస్తోందని, రాష్ట్రాన్ని మరో శ్రీలంకను చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో 14శాతం కమీషన్ సర్కార్ నడుస్తోందని, ఇద్దరు-ముగ్గురు మంత్రులకైతే అదే పనిగా మారిందని ధ్వజమెత్తారు. ఏడాది వ్యవధిలో ఏ గ్రామ పంచాయతీకి ఏ పథకం కింద ఎన్ని నిధులు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని, కాంగ్రెసకు దమ్ముంటే ఇదే అంశం అజెండాగా పంచాయతీ ఎన్నికలకు వెళ్దామని సవాల్ విసిరారు. కేసీఆర్ అంటేనే విశ్వాసఘాతకుడని సంజయ్ మండిపడ్డారు. ఫాంహౌజ్‌లో ఉండేవారికి, ప్రజల సమస్యలు పట్టించుకోనివారికి విపక్షనేత హోదా ఎందుకు? ఆ పదవి హరీశ్‌కో, బీసీ నేతలైన గంగుల, తలసానికో లేదా మరో నేతకో ఎందుకు ఇవ్వరు? అని నిలదీశారు.

**జైపాల్‌రెడ్డి పేరును వ్యతిరేకిస్తున్నాం**

రైతు భరోసా కింద 12వేలే ఇస్తామని ప్రకటించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జైపాల్‌రెడ్డి పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు అరుణ ప్రకటించారు. ఆ ప్రాజెక్టులో జైపాల్‌రెడ్డి పాత్ర ఏముందని ఆయన పేరు పెడుతున్నారని నిలదీశారు. పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల కోసం తన తండ్రి చిట్టెం నర్సిరెడ్డి పోరాటాలు చేశారని తెలిపారు. కాగా, రాష్ట్రంలో కోతల ప్రభుత్వం నడుస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగుతోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు.

# సంక్రాంతికి 52 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, జనవరి 5 : సంక్రాంతి సందర్భంగా పలు ప్రాంతాలకు వెళ్లి వచ్చే ప్రయాణికుల కోసం 52 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 6 నుంచి 18వరకు ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జనవరి 6, 7 తేదీల్లో చర్లపల్లి- తిరుపతి-చర్లపల్లి (07077/07078), 8, 9, 11, 12, 15, 16 తేదీల్లో చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి (02764/02763) మధ్య 6 రైళ్లు అందుబాటులో ఉంటాయి.

13న వికారాబాద్-కాకినాడ టౌన్ (07037), 14న కాకినాడ టౌన్-చర్లపల్లి (07038) మధ్య రైళ్లు నడుస్తాయి. 9, 10, 16, 17 తేదీల్లో కాచిగూడ-తిరుపతి- కాచిగూడ మధ్య నాలుగు, 11, 12, 18, 19 తేదీల్లో చర్లపల్లి-నర్సాపూర్-చర్లపల్లి (07035/07036) మధ్య నాలుగు, 12, 19 తేదీల్లో సికింద్రాబాద్-కాకినాడ టౌన్- సికింద్రాబాద్ మధ్య నాలుగు, జనవరి 7, 8, 9, 10, 13, 14, 15, 16, 17, 18 తేదీల్లో చర్లపల్లి-నర్సాపూర్-చర్లపల్లి (07033/07034)మధ్య పది రైళ్లు నడుస్తాయి. 8, 9, 10, 11, 12, 13, 14, 15 చర్లపల్లి-కాకినాడ టౌన్-చర్లపల్లి (07031/07032)మధ్య ఎనిమిది, జనవరి 6, 7, 13, 14 తేదీల్లో నాందేడ్-కాకినాడ టౌన్-నాందేడ్ (07487/07488) మధ్య నాలుగు, జనవరి 9, 10, 12, 13, 14, 15 తేదీల్లో చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్-చర్లపల్లి (07025/ 07026) మధ్య ఆరు రైళు అందుబాటులో ఉంటాయి. 7, 8 తేదీల్లో కాచిగూడ-శ్రీకాకుళం రోడ్-కాచిగూడ (07041/07042)మధ్య రెండు రైళ్లు నడపనున్నట్లు అధికారులు తెలిపారు.



# సీఎంఆర్ బాలికల హాస్టల్ ఘటనలో ఇద్దరి అరెస్టు




మేడ్చల్ టౌన్, జనవరి 5 : సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల బాలికల హాస్టల్ వాష్‌రూమ్‌లో వీడియోలు తీసిన ఘటనలో ఇద్దరు యువకులను మేడ్చల్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం వారిని రిమాండ్‌కు తరలించారు. అలాగే విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యహరించిన కళాశాల చైర్మన్, డైరెక్టర్, ప్రిన్సిపాల్‌తో పాటు ఇద్దరు వార్డెన్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి ఆదివారం వివరాలు వెల్లడించారు. హాస్టల్ బాత్రూమ్ వెంటిలేటర్ నుంచి తమను వీడియోలు తీసే ప్రయత్నం చేశారంటూ గత బుధవారం రాత్రి విద్యార్థినులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ మేరకు అక్కడ వంట మనుషులుగా పని చేస్తున్న నందకిషోర్ కుమార్ (20), గోవింద్ కుమార్ (20)ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టగా.. వారిద్దరూ నేరాన్ని అంగీకరించారు. గతంలోనూ విద్యార్థినుల పట్ల నిందితులు అసభ్యంగా ప్రవర్తించేవారని డీసీపీ తెలిపారు.

**నిందితుల విశ్రాంతిగది..**

హాస్టల్ బాత్రూమ్‌కు సమీపంలో ఉండడంతో వెంటిలేటర్ ద్వారా విద్యార్థినులను చూసేందు కు ప్రయత్నించారని తెలిపారు. బాత్రూమ్‌లో ఎవరో తొంగి చూస్తున్నారని, వీడియోలు తీస్తున్నట్టు అనుమానం ఉంద ని వార్డెన్లకు విద్యార్థినులు ఫిర్యాదు చేసినా పట్టించుకో కపోగా, నిందితులను కాపాడే ప్రయత్నం చేశారని పేర్కొన్నా రు. ఈ వ్యవహారం బయటికి పొక్కకుండాకళాశాల యా జమాన్యం తీవ్ర ప్రయత్నాలు చేసిందని చెప్పారు. బాలిక వసతి గృహాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటించలేదని, భద్రత నియమాలను పట్టించుకోలేదని పేర్కొన్నారు. హాస్టల్‌లో పని చేసే యువకులను అక్కడే ఉండటానికి అనుమతివ్వడం వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని తెలిపారు. ఈ మేరకు కళాశాల చైర్మన్ చామకూ ర గోపాల్ రెడ్డి, డైరెక్టర్ జగ్గారెడ్డితో పాటు వార్డెన్లు ప్రీతిరెడ్డి, కేవీ.ధనలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ అనంత నారాయణ పైనా కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు. విద్యార్థినుల భద్రత విషయంలో కళాశాల యాజమాన్యాలు, హాస్టళ్ల నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. కళాశాలలు, హాస్టళ్లలో ఎవరైనా వేధిస్తే విద్యార్థినులు నేరుగా పోలీసులను సంప్రదించాలని కోరారు.

# సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణలో ముందున్న ఎస్.వీ.ఎన్: గొట్టిపర్తి భాస్కర్

## నాడు నేర్చుకున్న సాంస్కృతిక కళారూపాలు మాలో చైతన్యం నింపాయన్న పూర్వ విద్యార్థులు

యాదగిరిగుట్ట, జనవరి 5 (రోమింగ్ న్యూస్): భారతీయ సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణలో ఎస్.వీ.ఎన్ ముందున్నదని గత 29 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థులను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దిందని యాదగిరిగుట్ట ఎస్.వీ.ఎన్ డిజిటల్ స్కూల్ వ్యవస్థాపకులు గొట్టిపర్తి భాస్కర్ అన్నారు. యాదగిరిగుట్టలో ఆదివారం 2004బి 2005 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1995లో ప్రారంభమైన ఎస్.వీ.ఎన్ ఎంతోమంది విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపినదని చెప్పారు. సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణ... దేశభక్తిని రంగరించడంలో తనదైన శైలిలో ముందుకు సాగుతున్నదని చెప్పారు. యాదగిరిగుట్టలో ఎవరూ చేయని విధంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలను కళారూపాల ద్వారా ప్రదర్శించి దేశభక్తిని రంగరించామని చెప్పారు. నాటి కార్గిల్ వార్ నుంచి మొదలుకొని స్వాతంత్ర సమరంలో అమరులైన వీరుల బాధలను తెలిపే ఎన్నో ఇతివృత్తాలను తీసుకొని కళారూపాలుగా మలిచి ప్రదర్శించిన ఘనత ఎస్.వీ.ఎన్ విద్యార్థులకే దక్కిందని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలోను దూం...ధాం కార్యక్రమాలతో ప్రజలను చైతన్యం చేసిందని చెప్పారు. ఈ దేశానికి అవసరమైన ఒక సివిల్ సర్వెంట్ ను, వందలాది మంది ఇంజినీర్లను డాక్టర్లను ఈ దేశానికి అవసరమైన అత్యుత్తమ పౌరులను అందించిందని చెప్పారు.







### నాడు నేర్చుకున్న సాంస్కృతిక కళారూపాలు మాలో చైతన్యం నింపాయి

నాటి కళారూపాల ప్రదర్శనలు ప్రత్యక్షంగా పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులు నాడు నేర్చుకున్న కళారూపాలు మాలో చైతన్యం నింపాయి... మమ్మల్ని ఈ స్థాయిలో నిలబెట్టాయని చెప్పారు. నాడు స్కూల్లో నేర్చుకున్న దేశభక్తి తమ పిల్లలకు కూడా రంగరింప చేస్తున్నామని వారు ఈ సందర్భంగా చెప్పడం గమనార్హం. విద్యార్థి లోకంలో స్పందన, జాగృతి, చైతన్యం లక్ష్యాలను కలిగించడం తద్వారా సమాజ చైతన్యానికి నాంది పలకడం అనేటువంటి అవకాశాలను తీసుకొని ముందుకు సాగడం వల్ల ఎంతో మంది బడుగు, బలహీన వర్గాల పేద పిల్లలను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దినదని చెప్పారు. క్రమశిక్షణ కోసం భాస్కర్ సార్ కఠినంగా ఉన్న మాట వాస్తవమేనని నాటి క్రమశిక్షణ వల్లనే పట్టుదల, ఏకాగ్రత అలవడ్డాయని చెప్పారు. సర్ వల్లనే తాము ఉన్నత స్థాయిలో నేడు జీవిస్తున్నామని పలువురు విద్యార్థులు ఈ సందర్భంగా చెప్పడం విశేషం. పూర్వ విద్యార్థిని డాక్టర్ ఆసూరి మరీంగంటి వైష్ణవి మాట్లాడుతూ తాను ఈ దేశం కోసం పాటుపడాలన్న తపన నేర్చుకున్నది భాస్కర్ సార్ ద్వారానే చెప్పారు. అద్భుతమైన దేశభక్తిని సార్ నుంచి అలవర్చుకున్నానని చెప్పారు. సంప్రదాయాలను మా కుటుంబం నుంచి నేర్చుకున్నప్పటికీ అంతకుమించినటువంటి పట్టుదల, ఏకాగ్రత, ఇతరులకు సహాయ పడాలన్న వ్యక్తిత్వం నేను స్కూల్లో నేర్చుకున్నదేనని చెప్పారు. బండి అనిల్ మాట్లాడుతూ పాచ్యాత్య సాంస్కృతిక పోకడలను వ్యతిరేకించడమే కాకుండా ఈ దేశం ఔన్నత్యాన్ని గురించి మొట్టమొదటగా ఎస్.వీ.ఎన్ లో భాస్కర్ సార్ నేర్పించిన విషయాన్ని ఆయన ఉదహరించారు. ఇదే విషయాన్ని వేముల గౌతమి, నరసిహ్మాశర్మ, కొరటికంటే రాజేశ్వరి, తాడూరి నవనీత, మొలుగు స్రవంతి, బుట్ రెడ్డి రజిని, మిట్ట హరిప్రియ, బీ. శ్రీలత, బీ. స్వాతి, డీ. శ్రీవాణి, పార్వతి, ప్రేమలత, పైల్ల సత్యవతి, బొజ్జ రజిని ఏషమైనమైన సురేష్, కన్నాయి చందన, బీ. శివశంకర్ గుజ్జ అర్చన, నోముల శ్రీశైలం, డీ.వెంకటేష్, గౌటి రాజశేఖర్ కూడా చెప్పారు.





### భాస్కర్ సార్ మాధురి మేడం ఉపాధ్యాయులకు ఘన సన్మానం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా ఎస్వి.వీ.ఎన్ వ్యవస్థాపకులు గొట్టిపర్తి భాస్కర్, ప్రిన్సిపాల్ మాధురిలను శాలువాలు... పూలమాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ఆ సమయంలో గణితం బోధించిన రామచందర్, హిందీ బోధించిన అశోక్, సైన్స్ బోధించిన భాగ్య, సోషల్ బోధించిన అశోక్ తదితర ఉపాధ్యాయులను కూడా ఈ సందర్భంగా పూలమాలలు... శాలువాలతో సన్మానించారు.ఎస్.వీ.ఎన్ డిజిటల్ స్కూల్ డైరెక్టర్ గొట్టిపర్తి వృతిక్ ను కూడా పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.










ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం 6 జనవరి 2025




# ప్రగతిశీల బోధనతోనే నాణ్యమైన విద్య: సాదుల మధుసూదన్







### సమర్థవంతమైన బోధన కోసం శిక్షణలు
### విజయవంతమైన జోగులాంబ గద్వాల్ జిల్లా టీచర్ల శిక్షణ కార్యక్రమం

జోగులాంబ గద్వాల, రోమింగ్ న్యూస్: చిన్నారుల్లో పునాది విద్యను సమర్థవంతంగా బోధించడానికి ప్రగతిశీల పద్ధతులను టీచర్లకు అందించడం లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా తాము ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు సాదుల మధుసూదన్ వెల్లడించారు. తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ మరియు వండర్ కిడ్స్ సంయుక్తంగా నిర్వహించిన టీచర్ల శిక్షణా కార్యక్రమం ఆదివారం జోగులాంబ గద్వాల్ జిల్లాలో విజయవంతంగా పూర్తయింది. ఈ కార్యక్రమంలో 650 మందికి పైగా టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాధుల మధుసూదన్ మాట్లాడుతూ 650 మందికి పైగా టీచర్లు చురుకుగా పాల్గొనడం వల్ల జోగులాంబ గద్వాల జిల్లాలో బోధనలో కచ్చితంగా నైపుణ్యాలు పెరుగుతాయని చెప్పారు. టీచర్లను ఆధునిక, విద్యార్థి-కేంద్రిత బోధనా పద్ధతులతో ప్రేరేపించడం వల్ల విద్యార్థుల్లో పట్టుదల పెరుగుతుందని చెప్పారు. సాహిత్య, గణిత నైపుణ్యాలను మెరుగుపరచడం వల్ల గణిత బోధన సులువు అవుతుందని చెప్పారు.సృజనాత్మకత మరియు భావనాత్మక అభివృద్ధి కోసం చర్యలు తీసుకున్నట్లవుతోందన్నారు. ఆటల ద్వారా విద్యా పద్ధతులు వినియోగించడం వల్ల చదువుపై ఇష్టం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ టీచర్లు ఈ శిక్షణను ఎంతో ఉపయోగకరంగా భావించారు. కృషి-ఆధారిత, పిల్లల స్నేహపూర్వక బోధన పద్ధతులు తరగతులలో వినియోగించడానికి తమకు గొప్ప మార్గదర్శకత్వం కలిగించిందని అభిప్రాయపడ్డారు.

#### నో బ్యాగు... నో హెూంవర్క్ పద్ధతి

వైజాగ్ వండర్ కిడ్స్ వ్యవస్థాపకులు. మల్లూ వాణి రామనాయుడు దంపతులు మాట్లాడుతూ తమ వండర్ కిడ్స్ సంస్థలో నో బ్యాగు... నో హెూంవర్క్ పద్ధతి ఫాలో అవుతున్నామని చెప్పారు. అయినా ప్రీ ప్రైమరీ విద్యార్థులు, ప్రైమరీ విద్యార్థులకు పోటీగా పరీక్షలు రాసే నైపుణ్యాలను పొందుతున్నన్న విధానాన్ని ఉదాహరణలతో సహ వివరించారు. విద్యార్థులకు ఇష్టంతో కూడిన బోధన సాగించడం కోసం చేస్తున్న ప్రయోగాలను ఆయన విజువలైజేషన్ ద్వారా టీచర్లకు ప్రాజెక్టర్ లో చూపిస్తూ వివరించారు.

#### క్రియేటివిటీ తో బోధన చేయాలి: కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి

ట్రస్మా రాష్ట్ర సలహాదారు మరియు తెలంగాణ గ్రీన్ అంబాసిడర్ కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ 21 సెంచరీ పిల్లలకు భోధన చేయడం కోసం ఉపాధ్యాయులు తమకు తాముగా అప్డేట్ కావలసిన అవసరాన్ని ఆయన నొక్కి వక్కాణించారు. ఎప్పటికప్పుడు పోటీ ప్రపంచంలో అద్భుతమైన బోధనను కొనసాగించాలంటే కొత్త విషయాలను నేర్చుకోవడం... టెక్నాలజీతో వాటిని అనుసంధానం చేసి భోదించడం అవసరమని ఆయన ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. శిక్షణ కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు అనేక పాఠశాలల కరస్పాండెంట్లు మరియు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు,

#### శిక్షణతో విద్య ప్రమాణాల పెంపు ఖాయం: ఉపాధ్యాయులు

విద్యా ప్రమాణాల అభివృద్ధి పట్ల తమకు ఎంతో నమ్మకం కలిగిందని చెప్పారు. టీచర్లు విద్యార్థి-కేంద్రిత బోధన పద్ధతుల ప్రభావాన్ని అభినందించినట్లు చెప్పారు. ఆటలతో బోధన మరియు కార్యకలాపాల ఆధారిత పద్ధతులు పిల్లల అభివృద్ధికి కొత్త మార్గాలను చూపుతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం తెలంగాణలో పునాది విద్యా రంగాన్ని మార్పు చేయడంలో ట్రస్మా చేస్తున్న ప్రగతిశీలమైన ప్రయత్నానికి నిదర్శనమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

ఆధునిక సాధనాలు, పద్ధతులతో టీచర్లను సిద్ధం చేయడం ద్వారా చిన్నారుల నైపుణ్యాల మెరుగుదల కోసం దీర్ఘకాలిక ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లా ట్రస్మా జిల్లా అధ్యక్షులు బాబు నాయుడు, ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి మోయిన్ భాష,కోశాధికారి రమేష్, ట్రస్మా నాయకులు మురళీధర్ రెడ్డి, నందు, తదితరులు పాల్గొన్నారు.






# ఈనెల 8న జరిగే ట్రస్మా జనరల్ బాడీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

### హాజరుకానున్న మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

**హైదరాబాద్,రోమింగ్ న్యూస్:** తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర వార్షిక సాధారణ సమావేశం ఈ నెల 8న నిర్వహిస్తున్నామని దీనికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరుకానున్నారని ట్రస్మా రాష్ట్ర శాఖ అధ్యక్షులు సాదుల మధుసూదన్ వెల్లడించారు. సమావేశ వివరాలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. రమేష్ రావు, కోశాధికారి పి. రాఘవేంద్ర రెడ్డిలతో కలిసి సాదుల మధుసూదన్ మీడియాకు వివరించారు. ఈ నెల 8న మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తో పాటు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా విచ్చేయున్నట్లు చెప్పారు. అదేవిధంగా తెలంగాణ ఉద్యమ నాయకులు, తెలంగాణ జనసభ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం కూడా హాజరవుతారని చెప్పారు. పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా ఈ సమావేశానికి విచ్చేయనున్నట్లు వారు వెల్లడించారు. కావునా ట్రస్మా సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశం తెలంగాణలో విద్యారంగ అభివృద్ధి, సమస్యలు, భవిష్యత్తు దిశలను చర్చించడానికి ప్రాముఖ్యత కలిగి ఉంటుందన్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారులు ఇతర కార్యవర్గ సభ్యులు తమ జిల్లాలోని ప్రతి ట్రస్మా సభ్యుడికి ఈ సమాచారం తెలియజేయాలన్నారు. ప్రతి సభ్యుడు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరు కావాలని మనవి చేశారు. మీ హాజరు ఈ సమావేశానికి విజయవంతంగా మలిచే కీలక భాగం అవుతుందని వారు వివరించారు. ఈ సమావేశం తెలంగాణలో ప్రైవేట్ పాఠశాలల విద్యా రంగానికి సంబంధించిన కీలక చర్చలకు, నిర్ణయాలకు ఒక ప్రధాన వేదికగా నిలుస్తుందన్నారు.

# 'రైతుభరోసా' జాప్యం కోసమే దరఖాస్తుల డ్రామా

### బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణ రెడ్డి



**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** 'రైతుభరోసా' అమలుపై కాలయాపన చేసేందుకే దరఖాస్తుల పేరుతో ప్రభుత్వం కొత్త డ్రామాకు తెరలేపిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణ రెడ్డి విమర్శించారు. ఆదివారం యాదగిరిగుట్ట మండలం మైలారుగూడెంలోని సాయిశివ ఫంక్షన్ హాల్ లో బీజేపీ మండల కమిటీ కోసం చేపట్టిన అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రైతుభరోసా పథకాన్ని తెచ్చి రైతులకు పంట పెట్టుబడి సాయం పెంచి ఇస్తామని ఎన్నికల్లో సమయంలో ప్రకటించిన కాంగ్రెస్.. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. రైతుభరోసా కోసం రైతుల నుండి మళ్ళీ దరఖాస్తులు తీసుకుంటామని చెప్తూ మరింత ఆలస్యం చేయాలని సర్కార్ కొత్తరకం కుట్రకు తెరలేపుతోందని అనుమానంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వలె ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విజయోత్సవాలు, పత్రికా ప్రకటనల పేరుతో ప్రజాధనాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై త్వరలో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ ఏలే చంద్రశేఖర్, బీజేపీ జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అజ్మీరా కిషన్ నాయక్, మండల అధ్యక్షుడు గుంటుపల్లి సత్యం, పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, సీనియర్ నాయకుడు తొడిమె రవీందర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, మహిళా మోర్చా అధ్యక్షురాలు అనురాధ, నాయకులు ఉపేందర్, ప్రసాద్, పోశెట్టి, యాకూబ్, మహేష్ తదితరులు ఉన్నారు.


# మంత్రిని కలిసిన కౌన్సిలర్ గాజుల సుకన్య

నకిరేకల్, తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ, సీమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ, నకిరేకల్ మున్సిపాలిటీ నాలుగో వార్డ్ కౌన్సిలర్ గాజుల సుకన్య శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి కౌన్సిలర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.




# నిజమైన రైతుల మేలు కోసమే 'రైతుభరోసా'

### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య
### యాదగిరిగుట్టలో సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: నిజమైన రైతులకు మరింత మేలు చేయడం కోసమే 'రైతుభరోసా' పథకాన్ని ప్రవేశపెట్టబోతున్నామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. ఆదివారం యాదగిరిగుట్టలోని బీర్ల నిలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. 140 సీఎంఆర్ఎఫ్, 50 కల్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాళ్లు, రప్పలున్న భూస్వాములకు బదులు కష్టపడి సాగుచేసే నిజమైన రైతులకే మరింత ఎక్కువ పంటసాయం అందిచడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ఇందుకోసమే రైతుభరోసా తెచ్చామన్నారు. భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబాలకు సైతం ఏడాదికి రూ.12 వేలు సాయం అందించబోతున్నామని చెప్పారు. అలాగే రేషన్ కార్డు లేనివారికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నామన్నారు. ఈ నెల 26 నుండి రైతుభరోసా, వ్యవసాయ కూలీలకు సాయం, కొత్త రేషన్ కార్డుల జారీ పథకాలను ప్రారంభించబోతున్నామని పేర్కొన్నారు. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లుగా.. అధికారం పోయినా కేటీఆర్ పొగరు, అహంకారం తగ్గలేదన్నారు. బీఆర్ఎస్ ఆగడాలపై ఏ పార్టీ నాయకులు మాట్లాడినా, జర్నలిస్టులు వార్తలు రాసినా 'టైమొచ్చినప్పుడు అందరి సంగతి తేలుస్తం' అని నోటికొచ్చినట్లు కామెంట్లు చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ మళ్ళీ అధికారంలోకి వస్తుందని కేటీఆర్ పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ దుకాణం ముగిసింది కాబట్టే కేసీఆర్ ఫాం హౌస్ నుండి బయటకు రావడం లేదని, ఇది అర్థం కాని కేటీఆర్, హరీష్ ఏదో ఉద్ధరిస్తామని ఊర్లలో ఊరేగుతున్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ప్రజా తీర్పును గౌరవించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ కు గుండు సున్నా తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఐనాల చైతన్యా మహేందర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్ గౌడ్, మదర్ డెయిరీ డైరెక్టర్ శ్రీశైలం, కౌన్సిలర్ మల్లేష్ యాదవ్, మండల నాయకుడు హేమేందర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు బందారపు బిక్షపతి, తుర్కపల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ శంకర్ నాయక్, రాజాపేట మండల అధ్యక్షుడు మహేందర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మోహన్ బాబు నాయక్ తదితరులు ఉన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

సోమవారం
6 జనవరి
2025





# యాదగిరిగుట్టలో భక్తుల కోలాహలం...!!

## ధర్మదర్శనానికి మూడు, స్పెషల్ దర్శనానికి గంట సమయం.. శ్రీవారి ఖజానాకు రూ. 52, 90, 951ఆదాయం



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. సండే హాలిడే కావడంతో.. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. రద్దీ కారణంగా నరసింహుడు ధర్మ దర్శనానికి మూడు గంటలు, స్పెషల్ దర్శనానికి గంట సమయం పట్టింది. ఇక భక్తులు అధిక సంఖ్యలో రావడంతో.. కొండ కిందా, పైనా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. లక్ష్మీపుష్కరిణి, కళ్యాణకట్ట, బస్సు బే, దర్శన, ప్రసాద క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయంలో నిర్వహించిన సుదర్శన నారసింహ హెూమం, బ్రహ్మోత్సవం, స్వామివారి నిత్య కళ్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఇక ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం సుప్రభాతంతో మొదలై రాత్రి పవళింపుసేవతో ముగిశాయి. భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ.52,90,951 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఆఫీసర్లు వెల్లడించారు. అత్యధికంగా ప్రసాద విక్రయం ద్వారా రూ.17,65,380, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.6.50 లక్షలు, వీఐపీ దర్శనాల ద్వారా రూ.9.45 లక్షల ఆదాయం సమకూరింది.



**వివిధ విభాగాల ద్వారా శ్రీస్వామి వారి ఆదాయము రూ.52,90,951 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎన్. భాస్కరరావు తెలిపారు. శ్రీ స్వామి వారికి 1700 మంది భక్తులు తలనీలాలు సమర్పించారని ఆయన చెప్పారు.**

**కళ్యాణ కట్ట 85,000/-**
**ప్రధాన బుకింగ్ 1,53,650/-**
**కైంకర్యములు2,001/-**
**సుప్రభాతం 15,700/-**
**బ్రేక్ దర్శనం 4,73,400/-**
**వ్రతాలు 1,03,200/-**
**వాహన పూజలు 18,000/-**
VIP **దర్శనం 9,45,000/-**
**,ప్రచారశాఖ 74,800/-**
**పాతగుట్ట 41,420/-**
**కొండపైకి వాహన ప్రవేశం 6,50,000/-**
**యాదఋషి నిలయం 1,65,990/-**
**సువర్ణ పుష్పార్చన 1,14,720/-**
**శివాలయం 10,200/-**
**శాశ్వత పూజలు 57,500/-**
**పుష్కరిణ 1,450/-**
**ప్రసాదవిక్రయం 17,65,380/-**
**లాకర్స్ 400/-**
**అన్నదానం 41,850/-**
**విమాన గోపురం5,71,290 /-**
**లీజెస్** Nill





# కరోనా లో సేవలకు..వంటల సోమయ్యకు సేవా రత్న అవార్డు



నకిరేకల్ : నల్గొండ జిల్లా కేతపల్లి మండల లోని ఇప్పల గూడెం గ్రామానికి చెందిన వంటల సోమయ్యకు హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగినటువంటి బౌజన సాహిత్య అకాడమీ ఎనిమిదవ తెలంగాణ రాష్ట్ర కాన్ఫరెన్స్లో బహుజన సాహిత్య అకాడమీ. జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా సేవా రత్న అవార్డు వంటల సోమయ్య అందుకు న్నారు ఈ సందర్భంగా నల్ల రాధాకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకు పోవడం కోసం బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతి ఎట ప్రజా ఉద్యమకారులకు సంఘ సేవకులకు కవులకు రచయితలకు స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేస్తున్నట్లు తెలియజేశారు తెలంగాణలో 31 జిల్లాల నుండి సుమారుగా 300 మంది డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్స్కు హాజరైనరని ఈ అవార్డు అందజేసిన వారితొ పాటుగా బిఎస్ఏ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎం గౌతం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉన్నారు. అనంతరం. అవార్డు గ్రహీత సోమయ్య మాట్లాడుతూ నల్గొండ జిల్లాలోని వైద్య పరంగా ఉద్యోగం చేస్తూ మిగతా టైంలో కరోనా టైంలో ప్రజలకు గ్రామాలలో తిరుగుతూ. సేవలు కరోనా కుటుంబాలకు సేవలు అందించి ప్రజ సేవ చేసినందుకుగాను నా సేవలను గుర్తించి. ఎన్నో సేవా కార్యక్రమాలను గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ జాతీయ చైర్మన్ నల్ల రాధాకృష్ణ నాకు సేవా రత్న అవార్డు ఇవ్వడం చాలా గర్వంగా ఉందని నాకు ఇంకా ప్రజాసేవ పట్ల బాధ్యత పెరిగిందని నా అవార్డు ఎలక్షన్ చేసిన ఎలక్షన్ కమిటీ మెంబర్ బుర్రి వెంకన్న కి కృతజ్ఞతలు తెలియజేశారు

# గ్రామసభల ద్వారా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలి

**కందాల ప్రమీల**



నకిరేకల్ : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక నర్ర రాఘవరెడ్డి భవనంలో సాకుంట్ల నరసింహ అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానంలో భాగంగా నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఇందిరమ్మ ఇండ్లను గ్రామసభల ద్వారా అర్హులైన వారిని ఎంపిక చేయాలన్నారు. ఒకే ఒకే ఇంటిలో రెండు కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయని, అట్టి కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. నిరుపేదలకు ఇండ్లు నిర్మించుకునేందుకు స్థలాలు లేవని, అట్టి వారిని గుర్తించి ప్రభుత్వమే వారికి ఇంటి స్థలాలు చూపించి ఇల్లు నిర్మాణం చేపట్టాలన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి రాచకొండ వెంకట్ గౌడ్, మండల కమిటీ సభ్యులు ఆకుల భాస్కర్, కొప్పుల అంజయ్య, చెన్నబోయిన నాగమణి, బహు రోజు ఇందిర వంటేపాక కృష్ణ, ఎరకలి అంజయ్య, గింజల లక్ష్మి, బొడ్డుపల్లి లక్ష్మీ నరసయ్య, వెంకట రంగారెడ్డి, బండమీది ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జనరల్
GENERAL

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

సోమవారం 6 జనవరి 2025





# మాట తప్పడమే ఇందిరమ్మ రాజ్యమా?




**నమ్మక ద్రోహం కాంగ్రెస్ నైజం**

**రైతులను దగా చేసిన రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు ముక్కు నేలకు రాయాలి**

**కేటీఆర్ విమర్శలు.. నేడు రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ నిరసన**

హైదరాబాద్, జనవరి 5 : తెలంగాణ రైతులను కాంగ్రెస్ నయా మోసం చేసిందని, నమ్మక ద్రోహం ఆ పార్టీ నైజమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రధాన హామీని నెరవేర్చకుండా రైతాంగానికి తీరని ద్రోహం చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ప్రజాక్షేత్రంలో ముక్కు నేలకు రాయాలన్నారు. డిక్లరేషన్ల పేరుతో నమ్మించి నయవంచన చేసిన రాహుల్ గాంధీ 70 లక్షలమంది రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం కాంగ్రెస్ తప్పుడు హామీలిచ్చిందని, ఆ పార్టీని తెలంగాణ రైతాంగం ఎన్నటికీ క్షమించదన్నారు. తాము అధికారంలోకి వస్తే రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సోనియాగాంధీ చెబితేనే తాను మాటిస్తున్నానని రేవంత్ రెడ్డి ఆనాడు అన్నారని, రైతు భరోసా గురించి ఇప్పుడు ఆయన చెబుతున్న మాటలు ఎవరూ నమ్మడం లేదన్నారు.

రైతులకు సంబంధించిన పలు హామీలను వరంగల్ డిక్లరేషన్ పేరుతో రాహుల్ గాంధీతో చెప్పించారని, అధికారంలోకి వచ్చాక ఆ పథకాల అమలుకే గ్యారెంటీ లేకుండా పోయిందని విమర్శించారు. గతంలో తమ ప్రభుత్వం రైతుబంధు కింద ఇచ్చిన పదివేలనే బిచ్చమన్న రేవంత్.. ఇప్పుడు చేస్తున్నదేమిటని నిలదీశారు. పెట్టుబడి సాయాన్ని రూ.2 వేలు పెంచడమంటే.. ఆయన దృష్టిలో ముష్టి వేస్తున్నట్లా? ఇచ్చినమాట తప్పడమే ఇందిరమ్మ రాజ్యమా? రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలకు ఏ కష్టం వచ్చినా.. వెంటనే తాను వస్తాన్న రాహుల్ గాంధీ.. ఇప్పుడు ప్రజలు కష్టాల్లో ఉంటే ఆయన ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగుల పరిస్థితులు బాగుండేవని సీఎం పదవిలో కూర్చొని రేవంత్‌రెడ్డి తెలంగాణను కించపరిచేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. దేశంలోనే ధనిక రాష్ట్రం తెలంగాణ అని ప్రతిపక్షంలో ఉన్నపుడు పేర్కొన్న రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అప్పులపాలైందని ప్రచారం చేస్తున్నారన్నారు. బాగోలేనిది రాష్ట్ర ఆర్థికపరిస్థితి కాదని.. ఆయన మానసిక పరిస్థితి అని అన్నారు.

**అప్పు తెచ్చిన డబ్బును ఏం చేశారు?**

ఇబ్బందికర పరిస్థితులను సరిదిద్దాల్సిన స్థానంలో కూర్చొని రాష్ట్రం గురించి సీఎం రేవంత్ రెడ్డి తక్కువగా మాట్లాడటం సరికాదని కేటీఆర్ అన్నారు. రాష్ట్రానికి ఆర్థిక ఇంజన్‌గా ఉన్న హైదరాబాద్‌లో హైడ్రా, మూసీ ప్రాజెక్టు కారణంగా రియల్ ఎస్టేట్ పడిపోయిందని ఆరోపించారు. కేసీఆర్ అప్పు చేస్తే.. ఆ డబ్బులను ప్రజలకు పంచారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో రూ.1.38 లక్షల కోట్ల అప్పు చేసి ఏం చేసిందని ప్రశ్నించారు. ఢిల్లీకి మూటలు పంపించారా? అని నిలదీశారు. రైతులందరికీ రైతు భరోసా పథకం వర్తింపచేసేవరకు కాంగ్రెస్ సర్కార్‌పై పోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా రైతులకు మద్దతుగా నిరసనలు చేపట్టనున్నట్లు కేటీఆర్ వెల్లడించారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా 19,600 సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు 26 రోజులుగా సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం స్పందించకపోవడం తగదని ఎమ్మెల్సీ కవిత ఎక్స్ వేదికగా అన్నారు.

## వినతిపత్రమూ ఇవ్వనివ్వరా?

హైదరాబాద్, జనవరి 5: బీఆర్ఎస్ హన్మకొండ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహా ఇతర నాయకులను నిర్బంధించటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వలేని నిర్బంధం కొనసాగుతున్నదని మండిపడ్డారు. రైతు భరోసా పేరిట కాంగ్రెస్ చేసిన మోసంపై ఆదివారం వరంగల్ పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టిని కలిసి వారికి రిప్రెజెంటేషన్ ఇచ్చే ప్రయత్నం చేసిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహా పార్టీ నేతలను పోలీసులు నిర్బంధించటం అత్యంత దుర్మార్గమని నిప్పులు చెరిగారు. ఎకరాకు రూ. 7,500 ఇస్తామని చెప్పి మాట తప్పిన కాంగ్రెస్ సర్కార్ తీరుపై యావత్ తెలంగాణ రైతాంగం చీదరించుకుంటున్నదని విమర్శించారు. రైతులు ఎకడ తిరగబడతారోనని మంత్రుల పర్యటనల్లో భారీగా పోలీసులను మోహరించి ఎన్నాళ్లు తప్పించుకుంటారని ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా ఎండగడుతూనే ఉంటామని, ఎకడికకడ నిలదీస్తూనే ఉంటామని తేల్చిచెప్పారు. సుదర్శన్‌రెడ్డితోపాటు బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఫార్ములా-ఈ కేసులో.. నేడు ఏసీబీ విచారణకు కేటీఆర్!

హైదరాబాద్, జనవరి 5 : ఫార్ములా-ఈ కారు రే సు కేసుకు సంబంధించి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సోమవారం మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించనుంది. ఈ నెల 6న ఉదయం 10 గంటలకు విచారణకు హాజరు కావాలంటూ ఏసీబీ అధికారులు ఇప్పటికే కేటీఆర్‌కు నోటీసులు జారీ చేశారు. న్యాయ నిపుణుల సూచన మేరకు ఈ కేసులో విచారణకు హాజరవుతానని కేటీఆర్ కూడా శనివారం బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో తెలిపారు. మరోవైపు తనపై ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలంటూ కేటీఆర్ హైకోర్టును ఆశ్ర యించారు.

ఈ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. తీర్పు ప్రకటించే వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దని పేర్కొంది. అయితే విచారణ కొనసాగించవచ్చని తెలిపింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్‌ను విచారణకు రావాల్సిందిగా ఏసీబీ నోటీసులిచ్చింది. దీంతో సోమవారం జరగనున్న పరిణామాలపై ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ఇదే కేసులో ఈ నెల 7న విచారణకు రావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేటీఆర్‌కు సమన్లు జారీ చేసింది. కాగా, ఈ కేసులో సహనిందితులుగా ఉన్న బీఎల్ఎన్ రెడ్డి, అరవిందకుమార్‌లనూ ఈ నెల 2, 3వ తేదిల్లోనే విచారణకు రావాలని ఈడీ సమన్లు జారీ చేయగా.. వారిద్దరు కొంత సమయం కావాలని రాతపూర్వకంగా కోరారు. దీంతో వారికి ఈడీ అధికారులు వారం రోజుల వ్యవధి ఇచ్చారు.

# చలి.. అసలు 'తగ్గేదేలే'

**అర్లీలో 5.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు**

**రాష్ట్రవ్యాప్తంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు**



హైదరాబాద జనవరి 5 : రాష్ట్రంలో అసలు 'తగ్గేదేలే' అన్నట్లు చలి విజృంభిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు బాగా పడిపోతున్నాయి. ఈ సీజన్‌లోనే అత్యల్పంగా శనివారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా అర్లీ (టీ)లో 5.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యూ)లో 6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవగా, తిర్యాణి మండలంలోని గిన్నెధరి గ్రామంలో 6.1 డిగ్రీలు, తిర్యాణిలో 7.3 డిగ్రీలు, వాంకిడి, కెరమెరిలో 7.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలితీవ్రత ఒక్కసారిగా పెరగడంతో జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలు వణికిపోతున్నాయి. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 7.1 డిగ్రీలు నమోదవగా, అల్గోల్‌లో 7.7, మల్‌చెల్మలో 9.5, మొగుడంపల్లిలో 9.8, సత్వార్‌లో 9.8, న్యాల్‌కల్‌లో 6.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని చిప్పల్‌తుర్తిలో 10.7, నర్సాపూర్‌లో 11.1, సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట్-భూమ్‌పల్లి 10.9, కొండపాక 11.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు రాష్ట్రంలో రాబోయే మూడు రోజులలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల మేర తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే ఐదు రోజుల పాటు రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో ఉదయం వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. పలు జిల్లాల్లో శీతల గాలులు వీచే అవకాశం ఉందని, ఆదిలాబాద్ జిల్లాలో వీటి ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

## గురుకుల విద్యార్థుల ప్రయోజనాలే ముఖ్యం



యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని ఎస్సీ, బీసీ గురుకుల బాలికల పాఠశాలలను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వసతి గృహాల్లోని వంట గదుల్లోకి వెళ్లి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన వంటకాలను పరిశీలించి డైనింగ్ హాల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు.

వసతి గృహాల్లో శుభ్రత, భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెంచిన చార్జీల మేరకు హాస్టల్‌లో మెనూ అందిస్తున్నారా? లేదా? అనే విషయాలను తెలుసుకునేందుకు నెలలో ఒక్కసారి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు క్యాబినెట్ మంత్రులు గు రుకులాలను సందర్శించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అందులో భాగంగా నే తాను బీబీనగర్‌లోని గురుకుల పాఠశాలలను సందర్శించినట్లు చెప్పారు.

## డిసెంబర్ 31న కండోమ్స్ ఆర్డర్ల జోరు

**న్యూయర్ వేడుకల్లో క్విక్ కామర్స్ వేదికలు అత్యధిక డెలివరీ**



హైదరాబాద్, జనవరి 5 : డిసెంబర్ 31న దేశవ్యాప్తంగా న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆ రోజు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, బ్లింకిట్, బిగ్ బాస్కెట్ వంటి క్విక్ కామర్స్ వేదికలు కస్టమర్లకు వేగంగా సేవలు అందించాయి. ఆ సేవలపై తాజాగా ఆసక్తికర డాటాను వెల్లడించాయి. వినియోగదారులు ఎక్కువగా ద్రాక్షపండ్లు, కండోమ్స్ ఆర్డర్ చేశారని తెలిపాయి. ఆ రో జు సాయంత్రం 5:30 గంటల వరకే స్విగ్గీ ద్వారా 4,779, అర్ధరాత్రి వరకు 1.2 లక్షల కండోమ్ ప్యాకెట్లను డెలివరీ చేసినట్టు వెల్లడించింది. బ్లింకిట్ డెలివరీ బృందం సాయంత్రం 8 వరకు 2.3 లక్ష ల ఆలూబుజియా, 6,834 ఐస్‌క్యూబ్ ప్యాకెట్లను డెలివరీ చేసింది. బిగ్ బాసె ట్ డెలివరీ చేసిన వాటిలో ఐస్‌క్యూబ్స్‌తోపాటు కార్డులు, పార్టీగేమ్స్, హెూంబేకింగ్ ఐటమ్స్, సోడా, మాక్‌టైల్స్ ఉన్నాయి.

## రోడ్డు ప్రమాదం.. కుటుంబం చిన్నాభిన్నం

**లారీ బైక్‌ను ఢీకొని తల్లి, తండ్రి, కుమార్తె మృతి**

**కుమారుడికి తీవ్ర గాయాలు.. మేడ్చల్‌లో ఘటన**



మేడ్చల్ టౌన్, జనవరి 5 : రోడ్డు ప్రమాదం ఓ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఆదివారం లారీ బైక్‌ను ఢీకొన్న ఘటనలో తల్లితండ్రి, కుమార్తె మృతి చెందగా, నాలుగేళ్ల కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఏపీలోని కాకినాడ జిల్లా ఎర్రవరం గ్రామానికి చెందిన బుల్లబ్బాయి (37) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. బుల్లబ్బాయి ఆయన మిత్రుడు వెంకటేశ్వరావును కలవడానికి భార్య సాగి లావణ్య (30) కూతురు హర్షిత (10), నాలుగేళ్ల కుమారుడు సిద్దేశ్వర్‌తో కలిసి బైక్‌పై మేడ్చల్ మండలం ఎల్లంపేటకు బయల్దేరారు. ఈ క్రమంలో మేడ్చల్ చెక్‌పోస్టు వద్ద వెనుక నుంచి వచ్చిన ఓ లారీ వీరి బైక్‌ను అతివేగంగా ఢీకొట్టింది. దీంతో బుల్లబ్బాయి, లావణ్య, హర్షిత అక్కడికక్కడే మృతి చెందగా సిద్దేశ్వర్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సిద్దేశ్వర్‌ను చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
6 జనవరి
2025







# సిడ్నీ టెస్టులోనూ
# ఆసీస్‌దే గెలుపు

- బోర్డర్ గవాస్కర్ సిరీస్ కైవసం
- డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఆస్ట్రేలియా

**ఆసీస్ గడ్డపై హ్యాట్రిక్ సిరీస్ సాధించడం అటుంచితే.. కోల్పోకుండా ఉండాలని భావించిన భారత్‌కు ఓటమి తప్పలేదు. సిడ్నీ వేదికగా జరిగిన ఐదో టెస్టును ఆసీస్ గెలుచుకుంది. దాదాపు పదేళ్ల తర్వాత బోర్డర్ - గావస్కర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. సిరీస్‌తోపాటు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ బెర్తును ఆసీస్ ఖాయం చేసుకుంది. మరోవైపు సిరీస్‌ను కోల్పోవడమే కాకుండా మూడోసారి డబ్ల్యూటీసీ ఫైనల్ చేరుకోవాలనే భారత్ ఆశలు గల్లంతయ్యాయి.**

**సిడ్నీ :** రసవత్తరంగా మారుతుందని భావించిన సిడ్నీ టెస్టులో ఎలాంటి అద్భుతం జరగలేదు. బుమ్రా బౌలింగ్ చేయకపోవడంతో ఆసీస్ ఎదుట ఉంచిన 162 పరుగుల లక్ష్యాన్ని భారత్ కాపాడుకోలేకపోయింది. ఆస్ట్రేలియా కేవలం 27 ఓవర్లలోనే నాలుగు వికెట్లను కోల్పోయి టార్గెట్‌ను ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 185 పరుగులు చేయగా.. ఆసీస్ 181 పరుగులకు పరిమితమైంది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా 157 పరుగులకు పరిమితమైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా స్కాట్ బోలాండ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా జస్‌ప్రీత్ బుమ్రా అవార్డులు సాధించారు. బుమ్రా లేకపోవడంతో భారత బౌలింగ్‌పై ఆసీస్ ఓపెనర్లు ఎదురు దాడికి దిగారు. సామ్ కొన్‌స్టాస్ (22) వచ్చీ రావడంతోనే దూకుడు ప్రదర్శిం చాడు. ప్రధాన పేసర్ సిరాజ్ కూడా ఆరంభంలో లెగ్ సైడ్ బంతులు వేయడంతో ఆసీస్ పని ఇంకా సులువైంది. మొదటి రెండు ఓవర్లలోనే 26 పరుగులను ఆసీస్ ఓపెర్లు రాబట్టారు. అయితే, ప్రసిధ్ కృష్ణ (3/65) స్వల్ప వ్యవధిలో వికెట్లు తీసి ఆసీస్‌పై ఒత్తిడి పెంచాడు. ఉస్మాన్ ఖవాజా(41) హాఫ్ సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. సిరాజ్ (1/69) బౌలింగ్‌లో ఔటయ్యాడు. అయితే, ట్రావిస్ హెడ్ (34), వెబ్‌స్టర్ (39) ఐదో వికెట్‌కు అజేయంగా 58 పరుగులు జోడించి ఆసీస్‌ను గెలిపించారు. స్టీవ్ స్మిత్ (4), మార్నస్ లబుషేన్ (6) విఫలమయ్యారు. ఆసీస్‌తో సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ బుమ్రా.. రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్‌కు రాలేదు. ఇదే భారత్‌ను ఇబ్బందికి గురి చేసింది. సిరాజ్, ప్రసిధ్, నితీశ్‌తో కూడిన పేస్ విభాగం ఆసీస్‌ను అడ్డుకోలేకపోయింది. అదే బుమ్రా ఉండుంటే.. ఆస్ట్రేలియా బ్యాటర్లు స్వేచ్ఛగా ఆడేందుకు ప్రయత్నించేవారు కాదు. అప్పటికీ త్వరగానే మూడు వికెట్లను పడగొట్టినా.. ఖవాజా, హెడ్, వెబ్‌స్టర్‌ను కట్టడి చేయలేక పోయారు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు బుమ్రా 32 వికెట్లు తీశాడు. ఇప్పుడీ కీలక సమయంలో బుమ్రా సేవలు లేకపో వడంతో సిరీస్‌నుసమం చేసే అవకాశాన్ని భారత్ చేజార్చుకుంది.

## తొలి ఇన్నింగ్స్‌లోనే నొప్పితో ఇబ్బంది పడ్డా : బుమ్రా

ఆస్ట్రేలియాతో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌ను భారత్ కోల్పోయింది. సిడ్నీ మ్యాచ్‌లోనూ ఆసీస్ గెలిచి 3-1 తేడాతో పదేళ్ల తర్వాత బోర్డర్ - గావస్కర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా 32 వికెట్లు తీసి టాప్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. అతడికే ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు దక్కింది. సిడ్నీ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో గాయం కారణంగా బౌలింగ్‌కు దిగలేదు. మ్యాచ్ అనంతరం బుమ్రా తన గాయంపై స్పందించాడు. సిరీస్‌పైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఐదు మ్యాచుల్లో 151 ఓవర్లు వేయడం గమనార్హం.'ఫలితం నిరాశకు గురి చేసింది. అయితే, కీలక సమయంలో బౌలింగ్ చేయలేకపోయినందుకు ఇంకాస్త బాధగా ఉంది. కానీ, మన శరీరాన్ని గౌరవించాలి. దాంతో మనం పోరాడలేం. శరీరం బాగుంటేనే ఏదైనా చేయగలం. ఈ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసేటప్పుడే కాస్త అసౌకర్యంగా అనిపించింది. వెన్ను నొప్పిపై వైద్య బృందంతో చర్చించా. జట్టులోని సహచరులు బాధ్యత తీసుకునేందుకు ముందుకొచ్చారు. ఒక బౌలర్ తక్కువైనప్పటికీ ఆసీస్‌ను కట్టడి చేయగలిగాం. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం మా బౌలర్ల పోరాటం సరిపోలేదు. ఈ సిరీస్‌లో కుర్రాళ్లు అదరగొట్టారు. ఒత్తిడిని తట్టుకోవడం నేర్చుకోగలిగారు. మంచి అనుభవం సాధించారు. సిరీస్‌ను గెలిచిన ఆసీస్‌కు శుభాకాంక్షలు' అని బుమ్రా వెల్లడించాడు. 'ఈ విజయం మాకు అసాధారణంగా అనిపిస్తోంది. తొలి మ్యాచ్‌లో ఓడినప్పటికీ మా ఆటగాళ్లు పోరాడిన తీరు అద్భుతం. ఇలాంటి జట్టుతో కలిసి ఆడటం సరదాగా ఉంది. మేం సాధించిన దానికి గర్వంగా ఉంది. ఒకే సిరీస్‌లో ముగ్గురు అరంగేట్రం చేశారు. వారి భాగస్వామ్యం విలువైంది. భారత్ వంటి జట్టును ఓడించాలంటే అన్ని విభాగాల్లోనూ రాణించాలి. నా కెరీర్ ఫేవరెట్ సిరీసుల్లో ఇదొకటి. రోహిత్, బుమ్రాకు ధన్యవాదాలు. అభిమానులు కూడా సిరీస్‌ను మరింత ప్రత్యేకంగా మలిచారు. ప్రతి వేదిక భిన్నమైంది. టెస్టు క్రికెట్‌కు ఆదరణ తగ్గడం లేదని మరోసారి నిరూపితమైంది. ప్రత్యేకమైన కారణంతో సిడ్నీలో పింక్ జెర్సీతో బరిలోకి దిగాం" అని ఆసీస్ కెప్టెన్ కమిన్స్ వ్యాఖ్యానించాడు.






## నేను భారతీయుడిని కదా..

### అందుకే అవసరం లేదేమో : సునీల్ గావస్కర్

బోర్డర్ - గావస్కర్ ట్రోఫీని ఆస్ట్రేలియా 3-1 తేడాతో కైవసం చేసుకుంది. సిడ్నీ టెస్టులో విజయం అనంతరం ట్రోఫీని అలెన్ బోర్డర్ చేతుల మీదుగా ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్ స్వీకరించాడు. అయితే, క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్‌ను ఆహ్వానించకుండానే.. బోర్డర్ చేతుల మీదుగా ప్రదానం చేయించడం ఇప్పుడు విమర్శలకు దారితీసింది. ఆసీస్‌కు ట్రోఫీని ఇస్తున్న సమయంలో మైదానంలోనే గావస్కర్ వ్యాఖ్యానం చేస్తూ ఉండటం గమనార్హం. దీనిపై గావస్కర్ కాస్త అసంతృప్తి వ్యక్తం చేశాడు. బోర్డర్‌తో కలిసి ఇచ్చేందుకు సంతోషించేవాడినని.. తనకు ఆహ్వానం లేకపోవడం నిరుత్సాహానికి గురి చేసిందని వ్యాఖ్యానించాడు. 'నేను ఇక్కడే ఉన్నా. ఆస్ట్రేలియా సిరీస్‌ను కైవసం చేసుకుంది. అదేమీ నాకు ఇబ్బందికరం కాదు. వారు బాగా ఆడారు. విజయం సాధించారు. కానీ, ట్రోఫీని బోర్డర్‌తో కలిస నేను కూడా అందిస్తే బాగుండేది. అయితే, నేను కేవలం భారతీయుడినే కాబట్టి పిలవలేదేమో. నా స్నేహితుడు అలెన్ బోర్డర్‌తో కలిసి ప్రెజెంటేషన్ కార్యక్రమంలో ఉండుంటే సంతోషించేవాడిని. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు నిర్వాహకులు వచ్చి ట్రోఫీ అందజేతపై తమ అభిప్రాయం తెలిపారు. ఒకవేళ భారత్ ఈ మ్యాచ్ గెలవకపోయినా.. మ్యాచ్ డ్రా అయినా నేను అవసరం లేదన్నారు. నాకు బాధేం లేదు. కానీ, నేను అయోమయానికి గురయ్యా. ఇది బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ కదా.. మేమిద్దరం కలిసి ఇస్తే బాగుంటుందని అనిపించింది' అని గావస్కర్ వెల్లడించాడు.

## అతడికి హక్కేలేదు..

### బుమ్రాతో కొన్‌స్టాస్ వాదనపై గంభీర్




సిడ్నీ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో ఆసీస్ యువ ఆటగాడు సామ్ కొన్‌స్టాస్ వాగ్వాదానికి దిగిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత బంతికే ఉస్మాన్ ఖావాజాను బుమ్రా ఔట్ చేశాడు. దీంతో భారత ఆటగాళ్ల కొన్‌స్టాస్ వైపు చూస్తూ సంబరాలు చేసుకున్నారు. వీటిపై ఆసీస్ కోచ్ మెక్‌డొనాల్డ్ స్పందిస్తూ.. 'భారత ఆటగాళ్ల సంబరాలు కాస్త భయపెట్టేలా ఉన్నాయి' అని వ్యాఖ్యానించాడు. వాటిపై గౌతమ్ గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో స్పందించాడు. 'కఠినమైన క్రీడలో సున్నితంగా ఉండలేరు. అలాగని ఎవరూ బెదిరింపులకు దిగరు. ఈ విషయంలో కొన్‌స్టాస్‌కు మాట్లాడే హక్కే లేదు. బుమ్రా, ఉస్మాన్ ఖవాజా సంభాషించుకుంటున్నప్పుడు మధ్యలో అతడు వెళ్లాల్సిన అవసరం లేదు. బ్యాటింగ్ కోసం స్ట్రైకింగ్‌లో ఉన్న ఆటగాడు, అంపైర్, బౌలర్ మాత్రమే మాట్లాడుకొనే అంశం. అది కొన్‌స్టాస్ పని కాదు" అని గంభీర్ వ్యాఖ్యానించాడు.

### అందరూ దేశవాళీ ఆడితే..

'జట్టులోని ప్రతి ఒక్కరినీ సమానంగా చూసే బాధ్యత నాదే. కొందరికి ప్రాధాన్యం ఇచ్చి.. మరికొందరిని దూరం చేయడం నాకు ఇష్టం ఉండదు. జట్టులోని ప్రతి ఒక్కరూ దేశవాళీ క్రికెట్ ఆడాలని కోరుకుంటా. వారు అందుబాటులో ఉన్నప్పుడు తప్పకుండా ఆడాలి. సుదీర్ఘ ఫార్మాట్‌లో నిబద్ధతతో ఆడాలనుకుంటే.. దేశావాళీ క్రికెట్‌ను మరిచిపోకూడదు' అని తెలిపాడు.




## 'సూపర్ స్టార్ సంస్కృతి' వద్దు..

### కోహ్లీపై మాజీ ఆల్‌రౌండర్ తీవ్ర విమర్శలు

టెస్టుల్లో నిలకడగా రాణించలేకపోతున్న విరాట్ కోహ్లీపై భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ తీవ్ర విమర్శలు గుప్పించాడు. టీమ్‌ఇండియాకు సూపర్ స్టార్ సంస్కృతి అవసరం లేదని, కోహ్లీని పక్కనపెట్టి అతడి స్థానంలో యువ ఆటగాడిని తుది జట్టులోకి తీసుకోవడానికి సమయం ఆసన్నమైందన్నాడు. విరాట్ దేశవాళీ క్రికెట్ ఎందుకు ఆడట్లేదని ప్రశ్నించాడు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో ఓటమి అనంతరం ఇర్ఫాన్ పఠాన్ స్టార్ స్పోర్ట్స్‌తో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఈ బీజీటీలో కోహ్లీ 9 ఇన్నింగ్స్‌ల్లో 23.75 సగటుతో 190 పరుగులు మాత్రమే చేశాడు. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో మాత్రం ఒక సెంచరీ చేశాడు. తర్వాత భారీ స్కోర్లు చేయలేకపోయాడు. ఆఫ్‌స్టంప్ ఆవల పడే బంతులను వేటాడి పెవిలియన్ చేరాడు. ఈ ఆసీస్ పర్యటనలో కోహ్లీ ఏడుసార్లు ఇదే విధంగా ఔట్ కావడం గమనార్హం. విరాట్ కోహ్లీ ఖాళీగా ఉన్నప్పుడు చివరగా దేశవాళీ క్రికెట్‌లో ఎప్పుడు ఆడాడో చెప్పండి? అతను డొమెస్టిక్ క్రికెట్ ఆడి దాదాపు దశాబ్దం అయింది. దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందూల్కర్ కూడా దేశవాళీ క్రికెట్ ఆడాడు. కొన్నాళ్లకు అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. సచిన్ డొమెస్టిక్ క్రికెట్ ఆడాల్సిన అవసరం లేదు. కానీ అతను కూడా ఆడటానికి వచ్చాడు' అని ఇర్ఫాన్ పఠాన్ పేర్కొన్నాడు.



# 'యానిమల్'.. అంగీకరించడానికి అదే కారణం: త్రిప్తి డిమ్రి

రణ్‌బీర్ కపూర్, రష్మిక జంటగా నటించిన చిత్రం 'యానిమల్'. ఇందులో జోయా పాత్రలో కనిపించి యువ హృదయాలను కొల్లగొట్టిన నటి త్రిప్తి డిమ్రి.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి మాట్లాడారు. ఆరంభంలో అవకాశాల్లేక కన్నీళ్లు పెట్టుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. తనకు బిగ్గెస్ట్ సక్సెస్ అందించిన 'యానిమల్'లో భాగం కావడంపై ఆమె మాట్లాడారు. 'యానిమల్'ను స్త్రీ ద్వేష చిత్రంగా నేనెప్పుడూ చూడలేదు. సినిమాలకు అలాంటి ట్యాగ్స్ ఇవ్వను. 'కోలా', 'బుల్బుల్' చిత్రాలు చేస్తున్నప్పుడు వాటిని స్త్రీవాద చిత్రాలుగా భావించలేదు. ఆయా కథల్లోని పాత్రకు కనెక్ట్ అయి.. దర్శకులపై నమ్మకం ఉంచి వాటిని ఎంచుకుంటా. ఈ సినిమాలో ఆఫర్ రాగానే దర్శకుడు సందీప్‌ను కలిశా. ఆయన నాకు కథ గురించి ఎక్కువగా చెప్పలేదు. జోయా పాత్ర గురించే వివరించారు. అప్పటివరకూ నేను కేవలం సున్నితమైన, పాజిటివ్ రోల్స్ మాత్రమే పోషించా. 'యానిమల్'లో నా పాత్ర ఇందుకు భిన్నమైంది. మనసులో మోసం చేయాలనే ఆలోచన ఉన్నప్పటికీ.. దయ, సానుభూతి కనిపించాలని దర్శకుడు చెప్పారు. అది నాకు సవాలుగా అనిపించింది. వెంటనే సినిమాకు ఓకే చెప్పాను" అని త్రిప్తి డిమ్రి తెలిపారు. గతేడాది వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు త్రిప్తి డిమ్రి. విక్కీ కౌశల్‌తో ఆమె నటించిన 'బ్యాడ్‌న్యూస్' మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో'లో రాజ్‌కుమార్ రావుకు ఆమె జోడీగా కనిపించారు. ప్రస్తుతం 'ధడక్ 2'లో యాక్ట్ చేస్తున్నారు.



## సంక్రాంతికి ప్రేమలో పడతారా ?

కథల ఎంపికలో ప్రత్యేకతను చూపించే కథానాయిక నిత్యామేనన్.. తమిళ కథానాయకుడు జయం రవితో కలిసి 'కాదలిక్క నేరమిల్లై' అనే సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రేమకథా చిత్రాన్ని కిరుతిగ ఉదయనిధి తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా పోస్టర్లకు, పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా ఈ నెల 14న థియేటర్లలోకి రాబోతున్నట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది చిత్రబృందం. "ఎంత వద్దనుకుంటే.. అంతగా ప్రేమలో పడతారు. మరి మీరు కూడా ఈ సంక్రాంతికి ప్రేమలో పడతారా? అయితే సిద్ధంగా ఉండండి" అని వ్యాఖ్యల్ని జోడించింది. రెడ్ జెయింట్ మూవీస్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రంలో యోగిబాబు, లాల్, వినయ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం నిత్య జాబితాలో 'ఇడ్లీ కడై', 'డియర్ ఎక్సెస్' సినిమాలున్నాయి.



## గ్లామర్ డోస్ పెంచేసిన పొలిమేర హీరోయిన్

కామాక్షి భాస్కర్ల.. 2018లో మిస్ తెలంగాణగా నిలిచింది. ఆ తర్వాత సినీరంగంలోకి అడుగుపెట్టి మెల్లిగా అవకాశాలను ఒడిసి పట్టుకుంది. టాలీవుడ్ ఇండస్ట్రీలో ఆమెకు ఆఫర్స్ క్యూ కట్టాయి. ప్రియురాలు అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఈ సినిమాతోనే టాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయమైన ఈ వయ్యారి.. మా ఊరి పొలిమేర సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం, విరూపాక్ష, పొలిమేర 2 చిత్రాల్లో నటించింది. ఈ సినిమాతోనే టాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయమైన ఈ వయ్యారి.. మా ఊరి పొలిమేర సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం, విరూపాక్ష, పొలిమేర 2 చిత్రాల్లో నటించింది. నిత్యం ఏదోక ఫోటోషూట్ షేర్ చేస్తుంటుంది. అటు ట్రెడిషనల్.. ఇటు మోడ్రన్ లుక్కులో కట్టిపడేస్తుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri
pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986